ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా మన దేశంలో మాత్రం తగ్గకపోవడం పెద్ద మిస్టరీగా మిగిలింది. 2014 నుంచి 2020 వరకు ముడి చమురు ధరలు కనిష్ట స్థాయికి పడిపోయినప్పటికీ సామాన్యుడికి ఎటువంటి ఉపశమనం లభించలేదు. పెట్రోల్‌పై 54 శాతం, డీజిల్‌పై 49 శాతం పన్నులు విధించడం విడ్డూరంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్ ధరలను సాకుగా చూపిస్తూనే దేశీయ వినియోగదారుడిని ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేయడం న్యాయం కాదని మేధావులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వాలు వసూలు చేస్తున్న పన్నుల భారం సామాన్యుడి వెన్నులో వణుకు పుట్టిస్తోంది. లాభాలన్నీ ప్రభుత్వ ఖజానాకు చేరుతుంటే సామాన్యుడి కష్టాలు మాత్రం రెట్టింపు అవుతున్నాయి.

**రష్యా ఉక్రెయిన్ యుద్ధం చౌక చమురు లాభం ఎవరికి**

రష్యా ఉక్రెయిన్ యుద్ధ సమయంలో మన దేశానికి రష్యా నుండి అతి తక్కువ ధరకు ముడి చమురు సరఫరా అయ్యింది. ఆ సమయంలో ఆ ప్రయోజనం సామాన్యుడికి దక్కకపోవడం గమనార్హం. తక్కువ ధరకు కొనుగోలు చేసినప్పటికీ దేశీయంగా పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించకపోవడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం వివరించాలి. తక్కువ ధరకు లభించిన చమురు ద్వారా వచ్చిన లాభం ఎటు వెళ్ళిందో అర్థం కాక ప్రజలు కలవరపడుతున్నారు. దీనిపై ప్రభుత్వం నుండి ఎటువంటి స్పష్టమైన ప్రకటన లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. చౌక చమురు కొనుగోలు చేసినా ఆ ప్రయోజనం సామాన్యుడికి దక్కకపోవడం ప్రభుత్వ వైఫల్యంగా పరిగణించవచ్చు.

**సంక్షోభం తెలిసి కూడా హెచ్చరించని వైనం**

మార్చి నెలలో పార్లమెంటులో పశ్చిమాసియా యుద్ధ ప్రభావాల గురించి ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. యుద్ధం వల్ల ముడి చమురు ధరలు పెరిగే అవకాశం ఉందని ముందే తెలిసినా ప్రజలను ఎందుకు అప్రమత్తం చేయలేదనేది అసలు ప్రశ్న. సంక్షోభం రాబోతుందని తెలిసినా కనీస హెచ్చరికలు జారీ చేయకుండా నిర్లక్ష్యం వహించడం వల్ల ఇప్పుడు ధరల మోత భరించలేక సామాన్యుడు సతమతమవుతున్నాడు. ప్రజల భవిష్యత్తు గురించి పట్టించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రజలు నిలదీస్తున్నారు. ముందుచూపు లేని నిర్ణయాల వల్ల సామాన్యుడు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాడనేది వాస్తవం.

**మాటల గారడీ ఎన్నికల వ్యూహమా**

ప్రధాని మాట్లాడే ప్రతి మాట ఆచి తూచి ఉంటుంది కావచ్చు కానీ అవి కేవలం ఎన్నికల ప్రయోజనాలకే పరిమితమవుతున్నాయి. సామాన్యుడి కష్టాలను ప్రస్తావించకుండా ఓట్ల కోసం మాత్రమే వ్యూహాలు రచించడం సరికాదని విశ్లేషకులు భావిస్తున్నారు. ధరలు పెరిగినప్పుడు ప్రజల వైపు నుంచి స్పందించడం పాలకుల కనీస ధర్మం. మోదీ ప్రభుత్వంలో ప్రజా శ్రేయస్సు అడుగున పడిపోయి కేవలం ఎన్నికల ప్రయోజనాలే కనిపిస్తున్నాయి. నాయకులు మాటల గారడీతో ప్రజలను మభ్యపెడుతున్నారనే భావన వ్యక్తమవుతోంది. సమస్యల పరిష్కారం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది.

**నిలదీస్తున్న సామాన్యుడి స్వరం**

పెట్రోల్ బంకు దగ్గర నిలబడి ధరలు కడుతున్న సగటు భారతీయుడు ఇప్పుడు తీవ్ర అసహనంతో ఉన్నాడు. కేవలం ప్రతిపక్ష నాయకులు మాత్రమే కాదు విశ్లేషకులు, జర్నలిస్టులు, సామాన్యులు అందరూ ఈ ప్రశ్నలను వేస్తున్నారు. ఈ ప్రశ్నలకు సమాధానం వస్తుందని ఎవరూ ఆశించడం లేదు కానీ ప్రజాస్వామ్యంలో నిలదీయడం పౌరుల హక్కు. ఈ ఆరు ప్రశ్నలు నేడు దేశవ్యాప్తంగా ప్రతి సామాన్యుడి గుండెల్లో మారుమోగుతున్నాయి. ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంటే ప్రభుత్వాలు తలవంచక తప్పదని హెచ్చరిస్తున్నారు. పాలకుల నిర్లక్ష్యం సామాన్యుడిని రోడ్డున పడేసేలా ఉంది.

**ముగింపు వైపు సాగుతున్న చర్చ**

ప్రభుత్వం ఎన్ని సమాధానాలు దాచిపెట్టినప్పటికీ ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు మాత్రం తొలిచేస్తున్నాయి. ఆయిల్ ధరల పెరుగుదల సామాన్యుడి బడ్జెట్‌ను తలకిందులు చేస్తోంది. ధరలు ఇలాగే పెరుగుతూ పోతే దేశ ఆర్థిక వ్యవస్థ ఏ స్థాయికి చేరుకుంటుందో అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సామాన్యుడిపై పడుతున్న ఈ భారాన్ని తగ్గించే దిశగా చర్యలు చేపట్టాలి. లేదంటే సామాన్యుడి ఆగ్రహానికి ప్రభుత్వాలు బలి కాక తప్పదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ప్రజల కష్టాలను గుర్తించి పాలకులు స్పందించాల్సిన సమయం ఆసన్నమైంది.

**భవిష్యత్తుపై నెలకొన్న ఆందోళన**

రాబోయే రోజుల్లో ఆయిల్ ధరలు మరిన్ని పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకనున్నాయి. ఇప్పటికే సామాన్యుడు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే రాబోయే రోజులు మరింత కఠినంగా మారబోతున్నాయి. దేశంలో పెట్రోల్, డీజిల్, సీఎన్జీ ధరల పెరుగుదల సామాన్యుడిని ఆర్థికంగా కుంగదీస్తోంది. ఏది ఏమైనా పెట్రోల్ బంకు దగ్గర సామాన్యుడు పడే ఆవేదనకు త్వరలో తెరపడాలని ఆశిద్దాం. పాలకుల నిర్ణయాలు ప్రజాహితంగా ఉండాలని కోరుకోవడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో సామాన్యుడు ఉన్నాడు.

# ప్రజావాణికి పోటెత్తిన ఫిర్యాదులు

- 80 సమస్యలకు ట్రాకింగ్ ఐడీ
- నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
- క్షేత్రస్థాయి అధికారులకు సీఎంసీ ఆదేశం



**సైబరాబాద్ విశాలభారతి:** పౌర సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా సైబరాబాద్ నగర పాలక సంస్థ (సీఎంసీ) ప్రతి సోమవారం నిర్వహిస్తున్న 'ప్రజావాణి' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సోమవారం సీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో పౌరుల నుంచి మొత్తం 80 ఫిర్యాదులు అందాయి. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, పారిశుధ్యం, రెవెన్యూ, విజిలెన్స్ తదితర విభాగాలకు సంబంధించిన సమస్యలను పౌరులు నేరుగా సంబంధిత విభాగాధిపతులకు విన్నవించారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా సమీక్షించిన అధికారులు.. పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రతి దరఖాస్తుకు ప్రత్యేక ట్రాకింగ్ ఐడీ (యూనిక్ ట్రాకింగ్ ఐడి ) కేటాయించి నమోదు చేశారు. ఫిర్యాదు పురోగతిని పౌరులు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు రశీదుతో పాటు ట్రాకింగ్ సదుపాయం కల్పించారు.

**పెండింగ్ సమస్యలపై స్పష్టమైన ఆదేశాలు...**

ప్రజావాణి అనంతరం సీఎంసీ ఉన్నతాధికారులు అన్ని విభాగాలకు, క్షేత్రస్థాయి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. పౌరుల ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో విభాగాల మధ్య సమన్వయాన్ని, ఫాలోఅప్ పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని, పెండింగ్ సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు స్పష్టమైన మార్పు కనిపించేలా పనిచేయాలని సూచించారు.ఫిర్యాదుల సమర్థ పరిష్కారం, నిరంతర ఫాలోఅప్, పౌరుల సంతృప్తిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. సైబరాబాద్ వ్యాప్తంగా సేవల నాణ్యతను, అధికారుల స్పందనను మెరుగుపరిచేందుకు క్రమం తప్పకుండా ప్రగతి సమీక్షలు నిర్వహిస్తామని సీఎంసీ తెలిపింది. 'సోమవారం ప్రజావాణి' పౌరులతో నేరుగా మమేకమవడానికి ముఖ్య వేదికగా నిలుస్తోందని, ఇది సమస్యల త్వరిత పరిష్కారంతో పాటు పారదర్శక, జవాబుదారీ, ప్రజా పక్షపాత పాలనకు బలం చేకూరుస్తోందని సీఎంసీ అధికారులు పేర్కొన్నారు.

## నిబద్ధత గల కమ్యూనిస్టు నాయకుడు పోగుల శ్రీనివాస్

**బి విజయ సారథి సిపిఐ జిల్లా కార్యదర్శి**



**కురవి విశాలభారతి:** తను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు నిలబడిన నిబద్ధతగల కమ్యూనిస్టు నాయకుడు పోగుల శ్రీనివాస్ అని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి కొనియాడారు. రాజోలు సిపిఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన పోగుల శ్రీనివాస స్థూపాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి ఆవిష్కరించగా అరుణ పతాకాన్ని జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి ఎగరవేసి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి,యువజన సంఘాలలో చురుకైన పాత్ర పోషించి మరిపెడ, డోర్నకల్ మండల కార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ సభ్యునిగా గీతా పనివారల సంగం రాష్ట్ర కార్యదర్శిగా మూడు దశాబ్దాలుగా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా, కుటుంబాన్ని సైతం పక్కనపెట్టి పార్టీ విస్తరణలో తనదైన శైలిలో పనిచేసి, ప్రజా పోరాటాలలో పాల్గొని నిజాయితీగల కమ్యూనిస్టుగా నిలిచిన శ్రీనివాస్ పోరాట స్ఫూర్తిని ప్రతి కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని, పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సన్నద్ధం కావాలి, ముంచుకొస్తున్న మతోన్మాదాన్ని ప్రతిఘటిస్తూ పార్టీని ముందుకు తీసుకపోవడమే శ్రీనివాస్ కు మనం అర్పించే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి అజయ్ సారథి రెడ్డి, హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు వరి పెల్లి వెంకన్న,పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, నవీన్, బాలకృష్ణ,బస్వ కొమరయ్య, బుర్ర సమ్మయ్య,బొల్లం ఉప్పలయ్య,కలగుర నాగరాజు,నక్క నాగరాజు బి ఆర్ ఎస్ నాయకులు తోట లాలయ్య, మారగని వీరభద్రం, నామ సైదులు కుటుంబ సభ్యులు సూరంభ, హరిత రాజు,గోపి తదితరులు పాల్గొన్నారు.

## దుగినేపల్లిలో మహిళా సంఘాల వీఓ భవనానికి శంకుస్థాపన



**పినపాక, విశాలభారతి :** పినపాక మండలం దుగినేపల్లి గ్రామంలో మహిళా సంఘాల కోసం నిర్మించనున్న వీఓ భవనానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడే విధంగా ఈ భవనం నిర్మించనున్నట్లు స్థానిక సర్పంచ్ కిరణ్ కుమార్, ఉప సర్పంచ్ సందీప్ రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ నాగేశ్వరరావు, గ్రామ ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పోకల కేశవా అర్జున్, సుఖరి రమణయ్య, ఆకుల నాగేశ్వర రావు, సాగర్ రెడ్డి, బిళ్ళం సాంబ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు అండగా పినపాక సర్పంచులు



**పినపాక, విశాలభారతి :** పాండురంగాపురం గ్రామపంచాయతీ పరిధిలోని విప్పలగుంపు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను పినపాక మండలానికి చెందిన పలువురు సర్పంచులు పరామర్శించారు. భూపాలపట్నం సర్పంచ్ స్వప్న, జానంపేట సర్పంచ్ పూణెం ఉమామహేశ్వరి, పాండురంగాపురం సర్పంచ్ ఈసం భవతి, తోగూడెం సర్పంచ్ వెంకటేష్, పొట్లపల్లి సర్పంచ్ మద్దెల సమ్మయ్య, బయ్యారం సర్పంచ్ చంద్రరావు, ఉప్పాక సర్పంచ్ బాబురావు బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నగదు సహాయం అందించడంతో పాటు నిత్యావసర సామగ్రిని పంపిణీ చేసి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు.

## లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి కొత్త డీటీఆర్ ఏర్పాటు



**పినపాక, విశాలభారతి :** పినపాక మండలంలో నెలకొన్న లో వోల్టేజ్ సమస్య పరిష్కార దిశగా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ బయ్యారం గ్రామంలో సమస్యను గుర్తించిన అధికారులు ఏఈ వేణుగోపాల్ ఆదేశాల మేరకు నూతన డీటీఆర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో గ్రామ ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారావు, లైన్‌మన్ వెంకటరావు, అసిస్టెంట్ లైన్‌మన్ మూర్తి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాది మొయినుద్దీన్ మృతి పట్ల సంతాపం



**కోదాడ, విశాలభారతి:** కబ్జాకు గురవుతున్న వక్ఫ్ బోర్డు భూముల రక్షణ కోసం నిరంతరం పోరాడిన ప్రముఖ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ మృతి పట్ల కోదాడ బార్ అసోసియేషన్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతికి నిరసనగా సోమవారం కోదాడ కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ... వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణ కోసం మొయినుద్దీన్ చేసిన పోరాటాలు, న్యాయపరమైన సేవలు మరువలేనివన్నారు. ఆయన మరణం న్యాయవాద రంగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. భూకబ్జాలకు వ్యతిరేకంగా నిలబడిన ఒక నిబద్ధత గల వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కోర్టు ప్రాంగణంలో మౌనం పాటించారు. మృతికి కారణమైన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు, సీనియర్ న్యాయవాదులు వై. సుధాకర్ రెడ్డి, పాలేటి. నాగేశ్వరావు, ఈదుల. కృష్ణయ్య, కమిటీ సభ్యులు జాయింట్ సెక్రెటరీ జానీ పాషా, ట్రెజరర్ కెవి రావు, పెద్దబ్బాయి, ఉయ్యాల. నరసయ్య, దొడ్డ. శ్రీధర్, సామా .నవీన్ కుమార్, తాటి. మురళి, రియాజ్, దావీదు, కోదండపాణి, నాగులుమీరా, గోవర్ధన్, రవీందర్, శ్రవణ్ కుమార్, రేణు, చక్రం తదితరులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురు మృతి



**కోదాడ, విశాలభారతి:** ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురు మృతి చెందిన విషాదకర ఘటన చోటుచేసుకుంది. మండల పరిదిలోని మొద్దుల చెరువు ఎన్‌హెచ్ 65, సమీపంలోని చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మునగాల మండలం, వెంకట్రామపురం గ్రామానికి చెందిన గీత రాజయ్య (57), అతని కూతురు కీత సునీత (40) మునగాల బ్యాంకు లో పని చూసుకొని వెళ్తుండగా మొద్దుల చెరువు స్టేజీ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఎక్సెల్ బైకును టిజి08ఏబి2373 నెంబర్ గల కారు వెనుక నుండి ఢీకొట్టడంతో ఈ ప్రమాదంలో తండ్రి, కూతురు అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ అతివేగమే, అజాగ్రత్తగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. మృతిదేహాలను సూర్యాపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్సై రత్నం తెలిపారు.

# రేవంత్.. మర్యాదగా వడ్లు కొను

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



సిద్దిపేట జిల్లాలోని ఎన్సాన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రెండు రోజుల్లో వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయకపోతే తానే స్వయంగా వేలాది మంది రైతులతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఆయన ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించారు. ప్రభుత్వ పనితీరు మిషన్ మోడ్‌లో కాకుండా కమిషన్ మోడ్‌లో సాగుతోందని ఆయన ఆరోపణలు గుప్పించారు. రేవంత్ రెడ్డి గారడీ మాటలు, ఢిల్లీ ట్రిప్పులను పక్కనపెట్టి, కొనుగోలు కేంద్రాలకు లారీల ట్రిప్పులను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కల్లాల్లో రోజుల తరబడి పడిగాపులు కాస్తున్న రైతుల దుస్థితిని ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యంపై నిప్పులు చెరిగిన హరీశ్‌రావు, క్వింటాల్‌కు 5 కిలోల తరుగు పేరుతో రైతులు నిలువునా మోసపోతున్నా మంత్రులు, అధికారులు మొద్దు నిద్ర పోతున్నారని విమర్శించారు. సిద్దిపేట గడ్డపై 45 రోజుల్లో రైతుబంధు ఇస్తానని ముఖ్యమంత్రి గొప్పలు చెప్పి, 63 రోజులు దాటినా ఆ మాట నిలబెట్టుకోలేక పోయారని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది రైతులు హరిగోస పడుతున్నారని, యూరియా సరఫరా, కరెంటు, రైతుబంధు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం, కష్టపడి పండించిన వడ్లను కొనుగోలు చేయడంలో కూడా దారుణంగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర రైతాంగం ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దాఖలాలు గతంలో ఎన్నడూ లేవని ఆయన స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వాల కాలంలో కూడా రైతులు ఇంతటి బాధను అనుభవించలేదని హరీశ్‌రావు గుర్తుచేశారు. రాష్ట్రంలో కోటి 40 లక్షల టన్నుల దిగుబడి వస్తుండగా, నిన్నటి వరకు 90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొంటామని చెప్పిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇవాళ 70 లక్షల టన్నులకే పరిమితం చేస్తామనడం అన్యాయమని ఆయన మండిపడ్డారు. మిగిలిన వడ్లను దళారులకు అమ్ముకుని రైతులు నష్టపోవాలా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. వడ్ల సేకరణలో ప్రభుత్వం చేతులెత్తేసి, కేంద్రం మీద నెపం నెట్టడం పరిపాటిగా మారిందని, గతంలో కేసీఆర్ కేంద్రం మెడలు వంచి ధాన్యం కొనేలా చేసిన విషయాన్ని ప్రభుత్వం మరిచిపోకూడదని ఆయన హితవు పలికారు. ఏసీ రూముల్లో కూర్చుని డైలాగులు కొట్టడం కాకుండా, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తరుగు తీస్తే తోలు తీస్తామని సీఎం రేవంత్ రెడ్డి, కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెబుతున్న మాటలు కేవలం పేపర్ టైగర్ డైలాగులేనని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. తన నియోజకవర్గంలోని నంగనూరు, ఖానాపూర్, ఖాతా, వెంకటాపూర్, నర్మెట, పాలమాకుల, సిద్దిపేట అర్బన్, ఎన్సాన్ పల్లి, మిట్టపల్లి, రావురూక్ల, రాఘవాపూర్, మల్లారం, సికిందలాపూర్ గ్రామాల నుంచి రైతులు ఆందోళన చెందుతున్నారని, మిల్లర్లు బస్తాకు 43 కిలోలు అడిగి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్ల దోపిడీపై జిల్లా పౌరసరఫరాల అధికారికి ఫిర్యాదు చేస్తే, వారితోనే మాట్లాడుకోవాలని బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇవ్వడం దారుణమని హరీశ్‌రావు ఆరోపించారు. రోహిణీ కార్తె వచ్చినా కొనుగోళ్లు పూర్తికాక వడ్లు కల్లాల్లోనే ముగ్గుతున్నాయని, కేవలం మూడో వంతు మాత్రమే కొనుగోలు చేశారని, ఇంకా రెండు వంతుల వడ్లు ఆరుబయటే ఉన్నాయని ఆయన తెలిపారు. మెదక్ జిల్లా కొల్చారంలో వర్షాల వల్ల వడ్ల కుప్పలపైనే ఒక రైతు మరణించగా, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 10 నుండి 12 మంది రైతులు కల్లాల్లో ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. నిన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో రైతుల కష్టాల గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. మార్చి 22న సిద్దిపేటలో 45 రోజుల్లో 9 వేల కోట్ల రైతుబంధు నిధులు జమ చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పటివరకు రెండు ఎకరాల రైతులకు తప్ప ఇతరులకు పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వలేదని హరీశ్‌రావు విమర్శించారు. కొమురెల్లి మల్లన్న, యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి, ఏడుపాయల అమ్మవారు, మెదక్ చర్చి వంటి పవిత్ర పుణ్యక్షేత్రాల మీద ఒట్లు పెట్టి, రుణమాఫీ చేయకుండా మాట తప్పిన ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మిగిలిపోయారని ఆయన మండిపడ్డారు. ఎన్సాన్ పల్లి కేంద్రంలో నెలన్నర రోజుల్లో కేవలం ఆరు లారీలు మాత్రమే వచ్చాయని, వానలకు వడ్లు తడిసి మట్టిలో కలిసిపోయాయని ఆయన విచారం వ్యక్తం చేశారు ముఖ్యమంత్రి ఢిల్లీకి 60 సార్లు ట్రిప్పులు కొట్టినా రైతులకు ఒరిగింది ఏమీ లేదని, ఆ ట్రిప్పులు ఆపి, కొనుగోలు కేంద్రాలకు లారీల ట్రిప్పులు పెంచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గన్నీ బ్యాగులు లేక కనకయ్య వంటి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గారడీ మాటలు బంద్ చేసి తక్షణమే గన్నీ బ్యాగులు పంపాలని ఆయన కోరారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించడం, వ్యక్తిగత దూషణలకు దిగడం తప్ప, సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదని ఆరోపించారు. నాగలక్ష్మి అనే మహిళా రైతు మక్కలు అమ్మి రెండు నెలలైనా డబ్బులు జమకాలేదని, వెంటనే మక్కలు, సన్ ఫ్లవర్, జొన్నలు అమ్మిన రైతులకు నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రెండు రోజుల్లో వడ్ల కొనుగోళ్లలో వేగం పెంచి, తరుగు లేకుండా కొని, లారీలు, గన్నీ బ్యాగులను పంపకపోతే తానే స్వయంగా వేలాది మంది రైతులతో కలెక్టరేట్‌ను దిగ్బంధం చేస్తానని హరీశ్‌రావు హెచ్చరించారు. రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం, ఇప్పటికైనా కళ్లు తెరిచి సమర్థవంతంగా కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ఇచ్చే హామీలు, చేసే పనులకు పొంతన లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆయన స్పష్టం చేశారు. ఎటువంటి సాకులు చెప్పకుండా వెంటనే కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించి, రైతుల కష్టాలను తీర్చాలని ఆయన కోరారు.

## కొత్తూరు గ్రామంలో మహిళా సాధికారతకు కొత్త చిరునామా



**నూతన మహిళా భవన్ ఘన ప్రారంభం**

**కురవి విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు (జీ) గ్రామ పంచాయతీలో మహిళల అభివృద్ధి, సంక్షేమం, సామాజిక కార్యకలాపాలకు మరింత బలం చేకూర్చే దిశగా నూతన మహిళా భవన్‌ను ఘనంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ ఎం నరేష్, ఉప సర్పంచ్ కట్ల అశ్విని ఆధ్వర్యంలో సంప్రదాయ పద్ధతిలో కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన నిర్వహించి మహిళా భవన్‌ను ప్రారంభించారు. గ్రామ మహిళలకు సమావేశాలు, స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలకు ఒక వేదికగా మహిళా భవన్ ఉపయోగపడనుంది. ఈ భవనం ద్వారా మహిళలు ఆర్థిక, సామాజిక రంగాల్లో మరింత ముందుకు సాగేందుకు అవకాశాలు పెరుగుతాయని గ్రామ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎం నరేష్ మాట్లాడుతూ, “గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకం. మహిళలు అన్ని రంగాల్లో ముందుండి నాయకత్వం వహించేలా గ్రామ పంచాయతీ తరపున అన్ని విధాలా సహకారం అందిస్తాం. మహిళల అభివృద్ధి కోసం అవసరమైన మౌలిక వసతులు కల్పించడం మా బాధ్యత. మహిళా భవన్ గ్రామ మహిళల ఐక్యతకు, అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలవాలి” అని అన్నారు. ఉప సర్పంచ్ కట్ల అశ్విని మాట్లాడుతూ మహిళల సాధికారతకు గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీ రాధా, గ్రామ సంఘం అధ్యక్షురాలు మౌనిక, పంచాయతీ కార్యదర్శి గీతతో పాటు గ్రామ మహిళలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కొత్తూరు గ్రామంలో నూతన మహిళా భవన్ ప్రారంభం మహిళల అభివృద్ధికి మరో ముందడుగుగా స్థానికులు అభివర్ణిస్తున్నారు.


## బేతోలు దళితవాడకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

- **వాటర్ ట్యాంక్ నిర్మించి మిషన్ భగీరథ నీటి సౌకర్యం కల్పించాలి**
- **జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన షేక్ ఖాదర్ బాబా**

**మహబూబాబాద్, విశాలభారతి:**



మహబూబాబాద్ మున్సిపాలిటీ అర్బన్ 6వ వార్డు పరిధిలోని బేతోలు గ్రామ దళితవాడలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సామాజిక కార్యకర్త షేక్ ఖాదర్ బాబా గ్రామ ప్రజల తరపున జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. దళితవాడ ప్రజలు చాలా కాలంగా స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



గ్రామంలో రెండు వాటర్ ట్యాంకులు ఉన్నప్పటికీ దళితవాడ ప్రజలకు తాగునీటి సౌకర్యం అందడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వాటర్ ట్యాంక్ బీసీ కాలనీ ప్రాంతానికి, మరో ట్యాంక్ గ్రామంలోని ఇతర ప్రాంతాలకు ఉపయోగపడుతున్నప్పటికీ దళితవాడ ప్రాంతానికి మాత్రం ఇప్పటి వరకు మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేయలేదని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ప్రత్యేక వాటర్ ట్యాంక్ కూడా నిర్మించకపోవడంతో దళితవాడలోని కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. గతంలో పలుమార్లు మున్సిపాలిటీ అధికారులు, సంబంధిత శాఖల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో చివరకు జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం దళితవాడ ప్రజలు వెంకటేశ్వర కుంట చెరువులోని బావి నీటిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే బావిలో నాచు పేరుకుపోవడంతో నీరు కలుషితమై తాగడానికి అనర్హంగా మారిందని గ్రామస్తులు తెలిపారు. ప్రత్యామ్నాయం లేక అదే నీటిని వినియోగించాల్సి వస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ఎర్రకుంట చెరువులోని బావి కూడా అడుగంటిపోవడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీటిని తాగడం వల్ల చిన్నారులు, మహిళలు, వృద్ధులు తరచూ అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని గ్రామస్తులు తెలిపారు. మంచినీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లడం, గంటల తరబడి వేచి ఉండడం ప్రజలకు భారంగా మారిందన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో సమస్య మరింత తీవ్రరూపం దాల్చుతోందని చెప్పారు. ఈ సందర్భంగా షేక్ ఖాదర్ బాబా మాట్లాడుతూ, “దళితవాడ ప్రజలు ఎన్నో ఏళ్లుగా కనీస తాగునీటి సౌకర్యం కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామంలోని ఇతర ప్రాంతాలకు మిషన్ భగీరథ ద్వారా నీరు అందుతున్నా దళితవాడ ప్రజలకు మాత్రం అందడం లేదు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించాలి. దళితవాడలో ప్రత్యేకంగా వాటర్ ట్యాంక్ నిర్మించి, మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి” అని కోరారు.

## అంగన్వాడి కేంద్రాల సేవలు మరింత మెరుగుపర్చాలి

**ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ డాక్టర్ రామచంద్ర నాయక్**




**మరిపెడ, విశాలభారతి:** మరిపెడ మండలంలోని 99 రోజుల ప్రణాళికలో భాగంగా మరిపెడ ఆడిటోరియంలో నిర్వహించిన అంగన్వాడి వంట కార్యక్రమంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న పోషకాహార భోజనాల తయారీ విధానాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యం, భవిష్యత్తు దృష్ట్యా నాణ్యమైన ఆహారం అందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పిల్లల శారీరక, మానసిక వికాసానికి పౌష్టికాహారం కీలకమని తెలిపారు.అంగన్వాడి సిబ్బందితో మాట్లాడిన ఎమ్మెల్యే, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందించే సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. మరిపెడ మండల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, ప్రజలకు అవసరమైన ప్రతి సేవ అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఐ సి డి ఎస్ సి డి పి ఓ ఎల్లమ్మ, సూపర్వైజర్ ఉషారాణి,అంగన్వాడి టీచర్లు, సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల అభివృద్ధికి మరో ముందడుగు

**భోసర గ్రామంలో వి ఓ భవన నిర్మాణానికి భూమిపూజ**



**ఆదిలాబాద్, విశాలభారతి:** ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలంలోని భోసర గ్రామంలో మహిళా సంఘాల అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. గ్రామ సర్పంచ్ సుభాష్ ఆధ్వర్యంలో సోమవారం వి ఓ (విలేజ్ ఆర్గనైజేషన్) భవన నిర్మాణానికి ఘనంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళా సంఘాల కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగేందుకు ఈ భవనం కీలకంగా మారనుందని సర్పంచ్ సుభాష్ తెలిపారు. గ్రామ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని నిర్మించబడుతున్న ఈ వి ఓ భవనం మహిళా సంఘాల సమావేశాలు, గ్రామస్థుల చర్చలు, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్రంగా ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కేటాయిస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు గ్రామ పంచాయతీ కట్టుబడి ఉందన్నారు. మహిళా సంఘాలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు ఈ భవనం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేసిన సర్పంచ్, నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి. మధుకర్, జి. ప్రభాస్, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య విద్యార్థులకు ఘనంగా ప్రతిభా పురస్కారాలు

**దేవరుప్పుల, విశాలభారతి:** జనగామలోని గాయత్రి గార్డెన్స్ లో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ ఘనంగా నిర్వహించారు. అధ్యక్షులు ప్రమోద్ కుమార్ అధ్యక్షతనలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలో పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ లో ప్రతిభ కనబరిచిన ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన బెల్దె. పద్మఅనిల్ గార్ల కూతురు సాహితి (ఆర్ జియుకెటి) బాసర కళాశాలలో ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్లలో ప్రథమ,ద్వితీయ బహుమతులు సాధించినందుకు ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి బహుమతులు అందజేశారు. పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## దేవన్నపేట పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**హసన్పర్తి, విశాలభారతి :** 200809 , బ్యాచి విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఈరోజు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సమ్మేళనంలో బాల్య జీవితాలను మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ సంతోషకరమైన వాతావరణంలో గడిపారు.స్థానిక ఉన్నత పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి గారి అధ్యక్షతన ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థిని విద్యార్థులందరూ ఒకరి తర్వాత ఒకరు తమ జ్ఞాపకాలను తన కుటుంబ నేపథ్యాన్ని వివరించారు. మేము ఏదైతే చేయజాలక పోయామో మాపిల్లల ద్వారానైనా ఆ గమ్యాన్ని చేరుకోవాలని కోరుకుంటున్నామని తెలియజేశారు.తిరిగి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులందరూ వారు వారి ప్రసంగంలో మంచి నైతిక విలువలతో జీవిస్తూ కుటుంబాలను బాగుపరచుకోవాలని సమాజానికి,ప్రభుత్వ బడులకు, తోడ్పడాలని ఈ ఆత్మీయ సమ్మేళనాలు వింత పోకడలకు తావీయకుండా అందరికీ మార్గదర్శకంగా ఉండాలని హితవు పలికారు. విందును ఆరగించిన పిమ్మట తమ గురువులను పూలమాలలు శాలువాలతో సత్కరించారు, ఈ కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, గురువులు మహేందర్ రెడ్డి, నాగేశ్వరరావు, వీణ, రాజేంద్రప్రసాద్, రుక్మిణి, అంజయ్య భాస్కుల,రమాదేవి రాజు, పాల్గొన్నారు.పూర్వ విద్యార్థులందరూ పాల్గొనడం

## పోషకాహారంపై అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్



**మహబూబాబాద్ జిల్లా విశాలభారతి:** ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ పట్టణంలోని గంగపుత్ర భవన్‌లో నిర్వహించిన స్త్రీ వారోత్సవాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూట్రిషన్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్, కుకింగ్ పోటీలు, ఏఎంసీ చెకప్‌తో పాటు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మహిళలతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి ఏఎంసీ చెకప్ సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసి, ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలకమని సూచించారు. ప్రతి ఒక్కరూ నాణ్యమైన పోషకాహారం తీసుకోవాలని, శరీరానికి అవసరమైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఆహారపు అలవాట్లలో భాగం చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న ఆరోగ్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించాలని మహిళలకు సూచించారు. అనంతరం నిర్వహించిన కుకింగ్ పోటీల్లో పాల్గొన్న మహిళలను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు సమాజంలో పెంపొందేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంపొందించుకున్నారు.

## ప్రభుత్వ సూచనల మేరకు మార్కెట్ వ్యాల్యూ అమలు చేయాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మార్కెట్ వ్యాల్యూ అమలుపై జిల్లా స్థాయిలో కీలక సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దారులతో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా మార్కెట్ వ్యాల్యూ అమలును సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భూములు, ఆస్తుల మార్కెట్ విలువల అమలులో పారదర్శకత, సమన్వయం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానాలు ప్రజలకు సక్రమంగా చేరేలా చూడడంతో పాటు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.మార్కెట్ వ్యాల్యూ అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉచిత మొబైల్ ఏఐ చెస్ట్ ఎక్స్ రే స్క్రీనింగ్ క్యాంప్



**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండల పేరూరు ఆరోగ్య కేంద్రపరిది కృష్ణాపురం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కృష్ణాపురం సర్పంచ్ పూనం విజయబాబు సమక్షంలో Rbsk Dr నవీన్ ఆధ్వర్యంలో TB ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కృష్ణాపురం గ్రామంలో. MPUPS స్కూల్ నందు పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొబైల్ ఏఐ చెస్ట్ ఎక్స్ రే స్క్రీనింగ్ క్యాంప్ ఈ శిబిరం నందు 117 మందికి ఈ x ray తీయగా అందులో 32 మంది TB మరియు TB యేతర అనుమానితులను గుర్తించడం జరిగింది. ఈ సందర్భంగా Dr నవీన్ RBSK మాట్లాడుతూ క్షయ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి. జిల్లా క్షయ నివారణ అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోనీ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో. Heo P వేణుగోపాల్ కృష్ణ, TU వెంకటాపురం STS P వెంకటేశ్వర్లు, ఎక్స్ రే టెక్నీషియన్ లకన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సుమలత, తిరుపతి, ఆశ వర్కర్స్ , RBSK సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కార్పొరేషన్ చైర్మన్లు

**అభివృద్ధి – బ్రాహ్మణ సంక్షేమంపై కీలక చర్చలు నిర్వహించిన బసవరాజ్ శ్రీనివాస్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజ్ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర అభివృద్ధి, బ్రాహ్మణ సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వైస్ చైర్మన్లు కూడా పాల్గొని ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించినట్లు సమాచారం. బ్రాహ్మణ సంక్షేమానికి సంబంధించిన పథకాలు, యువత ఉపాధి అవకాశాలు, విద్యా రంగ అభివృద్ధి, సామాజిక వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ముఖ్యమంత్రికి వివరించినట్లు బసవరాజ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన తెలిపారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ సామాజిక వర్గాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు ముఖ్యమంత్రిని కలిసి తమ శాఖలకు సంబంధించిన అంశాలను వివరించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. అధికార పార్టీలో సమన్వయం, సంక్షేమ కార్యక్రమాల వేగవంతం, సామాజిక వర్గాలకు మరింత చేరువ కావడంలో భాగంగానే ఈ భేటీ జరిగినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములుగా పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని సమావేశంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.

# హైదరాబాద్ మెట్రోకు ఆర్థిక బలం

- మెట్రోకు రూ.13,600 కోట్ల ఆర్థిక సాయం
- మెట్రో పూర్తి ప్రభుత్వ నియంత్రణలోకి చేరింది
- ప్రాజెక్టుపై ఉన్న అప్పుల భారం తగ్గింది
- కొత్త కారిడార్ల పనులు వేగవంతం కానున్నాయి
- ఆధునిక రవాణా వ్యవస్థకు ప్రాధాన్యత
- రోజుకు 5 లక్షల మందికి మెట్రో ప్రయాణం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగర ప్రయాణ చరిత్రలో ఒక నూతన అధ్యాయం ఆవిష్కృతమైంది. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మెట్రో రైల్ ప్రాజెక్టును మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు పడ్డాయి. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా రూ.13,600 కోట్ల భారీ నిధులు సమకూరాయి. సోమవారం ఢిల్లీ వేదికగా జరిగిన కార్యక్రమంలో ఐఆర్ఎఫ్‌సీ, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మధ్య ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ఈ కీలక ఘట్టం మెట్రో ప్రాజెక్టు ఆర్థిక గమనాన్ని పూర్తిగా మార్చనుంది. ప్రాజెక్టుకు లభించిన ఈ ఆర్థిక భరోసా నగరం నలుమూలల మెట్రో కనెక్టివిటీని విస్తరించడంలో కీలకపాత్ర పోషించనుంది. దేశంలోని మరే ఇతర మెట్రో ప్రాజెక్టుకు లేని విధంగా హైదరాబాద్ మెట్రో ఇప్పుడు ప్రభుత్వ పూర్తి పర్యవేక్షణలోకి వచ్చింది. ఈ ఆర్థిక ఒప్పంద కార్యక్రమంలో ఐఆర్ఎఫ్‌సీ సీఈఓ మనోజ్ కుమార్ దుబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి రవాణా కేంద్రంగా తీర్చిదిద్దాలని సంకల్పించింది. సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడం పట్ల ప్రభుత్వం నిబద్ధతను చాటుకుంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ రంగానికి, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెట్రో విస్తరణ అనివార్యమని ప్రభుత్వం గుర్తించింది. నగరం యొక్క మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ భారీ ఆర్థిక వ్యూహాన్ని రూపొందించారు. రవాణా రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా నగర ఆర్థిక వ్యవస్థను మరింత వేగవంతం చేయాలనేది ప్రభుత్వ ఆశయం. రీఫైనాన్సింగ్ ప్రక్రియ మెట్రో ప్రాజెక్టుకు గొప్ప ఆర్థిక ఉపశమనం అందించింది. గతంలో ఉన్న అధిక వడ్డీ రేట్ల రుణ భారాన్ని తగ్గించుకోవడం ద్వారా దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడం సాధ్యమవుతుంది. ఈ నిధుల ద్వారా పాత రుణాలను సర్దుబాటు చేస్తూ భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలకు దారి సుగమం చేసుకుంటున్నారు. ఎల్ అండ్ టీ మెట్రో రైల్ సంస్థలోని 100 శాతం వాటాను ప్రభుత్వం ఇప్పటికే హెచ్ఎంఆర్ఎల్ ద్వారా తన సొంతం చేసుకుంది. దీనివల్ల హైదరాబాద్ మెట్రో పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోని ప్రజా రవాణా వ్యవస్థగా రూపాంతరం చెందింది. ప్రభుత్వ యాజమాన్యంలోకి రావడం వలన ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించేందుకు వీలు కలుగుతుంది. ఈ రూ.13,600 కోట్ల నిధుల వినియోగం పక్కా ప్రణాళికతో సాగనుంది. నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్లు వంటి మార్గాల ద్వారా ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించనున్నారు. వర్కింగ్ కాపిటల్ రీఫైనాన్సింగ్ ద్వారా మెట్రో నిర్వహణ వ్యయాలను నియంత్రించే వీలుంటుంది. ప్రభుత్వమే నేరుగా బాధ్యత వహించడం వలన నిధుల కేటాయింపులో పారదర్శకత ఉంటుంది. మెట్రో నిర్వహణలో ఎదురవుతున్న ఆర్థిక సవాళ్లను అధిగమించడానికి ఈ రీఫైనాన్సింగ్ వ్యూహం ఒక దిక్సూచిగా పనిచేస్తుంది. అప్పుల భారం నుంచి బయటపడటంతో పాటు రాబోయే రోజుల్లో ఆదాయ వనరులను పెంచుకోవడానికి కూడా ఈ ఆర్థిక క్రమశిక్షణ దోహదపడుతుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1 దాదాపు 69.2 కిలోమీటర్ల పొడవుతో మూడు కారిడార్లలో సేవలందిస్తోంది. 57 స్టేషన్ల ద్వారా ప్రతిరోజూ 5 లక్షల మందికి పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తోంది. నగరంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాలను కలుపుతూ సాగుతున్న ఈ మెట్రో సర్వీసులు ప్రజల రవాణా కష్టాలను తీర్చాయి. ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెడుతూ తక్కువ సమయంలోనే సుదూర ప్రాంతాలకు చేరుకునే సదుపాయాన్ని కల్పించాయి. పర్యావరణహిత రవాణా మార్గంగా మెట్రోను ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారు. ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో మెట్రో సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొత్త కారిడార్ల నిర్మాణం, మెట్రో విస్తరణ పనులకు ఈ రీఫైనాన్సింగ్ ఒక పెద్ద ఊతం. ఇప్పటివరకు ఉన్న మూడు కారిడార్లకు తోడు నగరంలోని మరిన్ని ప్రాంతాలకు మెట్రోను విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. చివరి మైలు కనెక్టివిటీకి అంటే మెట్రో స్టేషన్ల నుంచి గమ్యస్థానాలకు చేరుకోవడానికి మరిన్ని ఫీడర్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. విస్తరణ పనులు వేగవంతం కావడం వల్ల మరిన్ని వేలమంది ప్రయాణికులకు మెట్రో ప్రయోజనాలు అందుతాయి. మెట్రో నగరం మధ్యలో ఆగిపోకుండా శివారు ప్రాంతాలకు కూడా విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. విస్తరణ ప్రణాళికల అమలులో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడటమే ఈ ఆర్థిక బలోపేతం ఉద్దేశ్యం. నగరం యొక్క విస్తృతిని పరిగణనలోకి తీసుకుంటే రాబోయే పదేళ్లలో హైదరాబాద్ రూపురేఖలు మారనున్నాయి. ప్రస్తుత మెట్రో నెట్‌వర్క్‌ను నగరంలోని నలుమూలలకు అనుసంధానించడం ద్వారా రవాణా వ్యవస్థ సంపూర్ణం అవుతుంది. మెట్రో స్టేషన్ల వద్ద పార్కింగ్ సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల మెరుగుదలకు కూడా నిధులు కేటాయించే అవకాశం ఉంది. ఆధునిక రవాణా వ్యవస్థ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుండటం ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతోంది. ప్రపంచస్థాయి నగరాలకు ధీటుగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే దిశగా మెట్రో విస్తరణ ఒక ప్రధాన మైలురాయిగా నిలుస్తుంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ ఆర్థిక ఒప్పందం గొప్ప ఫలితాలను ఇస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో మెట్రో నిర్వహణను కొనసాగించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే కాకుండా, నిర్వహణ వ్యయాన్ని తగ్గించడంపై దృష్టి సారించారు. ఆధునిక సాంకేతికతను జోడించడం ద్వారా మెట్రోను మరింత సమర్థవంతంగా నడపవచ్చు. సిగ్నలింగ్ వ్యవస్థలు, బోగీల సంఖ్యను పెంచడం వంటి అంశాలపై కూడా దృష్టి పెట్టాలి. ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్నందున ప్రజా అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం సులభతరమవుతుంది. తద్వారా మెట్రో ప్రాజెక్టును లాభాల బాట పట్టించేందుకు ప్రభుత్వానికి ఉన్న అవకాశాలు మెండుగా ఉన్నాయి. సుస్థిరమైన, ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధిలో ఈ ఒప్పందం ఒక కీలక మలుపు. ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా ఈ రీఫైనాన్సింగ్ ప్రక్రియ నిలుస్తోంది. మెట్రో రైలు వ్యవస్థ కేవలం రవాణా సాధనంగానే కాకుండా నగర ఆర్థిక వృద్ధికి వెన్నెముకగా మారుతోంది. ట్రాఫిక్ రహిత ప్రయాణం వల్ల సమయం ఆదా అవ్వడంతో ప్రజల ఉత్పాదకత పెరుగుతుంది. పర్యావరణంపై ఒత్తిడిని తగ్గించడంలో కూడా మెట్రో ముఖ్యపాత్ర పోషిస్తోంది. ఇంధన వినియోగాన్ని తగ్గించడం ద్వారా నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు మెట్రో ఒక వరం. ఈ దిశగా ప్రభుత్వ అడుగులు అభినందనీయం. హైదరాబాద్ మెట్రో ఇప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. రూ.13,600 కోట్ల రీఫైనాన్సింగ్‌తో ప్రాజెక్టు భవిష్యత్తు సురక్షితమైంది. విస్తరణ పనులు వేగవంతం కావడం వల్ల మెట్రో నగరం అంతటా విస్తరిస్తుంది. ప్రతి ప్రయాణికుడు ఆశించే విధంగా మెట్రో సేవలు మరింత అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాబోయే తరాలకు ఆదర్శంగా నిలుస్తుంది. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చే క్రమంలో మెట్రో రైల్ ప్రాజెక్టు పాత్ర కీలకం కానుంది. సమర్థవంతమైన రవాణా వ్యవస్థ నిర్మాణంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ చర్య నగర అభివృద్ధికి ఒక గొప్ప పునాది.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యులపై పెనుభారం

**కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ధరలు తగ్గించాలి : సిపిఐ నేత అజ్మీరా హరి సింగ్ నాయక్ డిమాండ్**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :**



దేశవ్యాప్తంగా మరోసారి పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నాయని సిపిఐ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరి సింగ్ నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన ఇంధన ధరలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న వ్యాట్‌ను కూడా తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయిల్ కంపెనీలు లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున ధరలు పెంచగా, ఈ పెంపు సోమవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. దీంతో హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.58కి, డీజిల్ ధర రూ.103.74కి చేరింది. గత 10 రోజుల్లో నాలుగు సార్లు ఇంధన ధరలు పెరగడం ప్రజల్లో తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ఈ సందర్భంగా అజ్మీరా హరి సింగ్ నాయక్ మాట్లాడుతూ.. క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగాయని చెబుతూ ప్రజలపై భారాన్ని మోపుతున్న కేంద్ర ప్రభుత్వం, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గినప్పుడు ఎందుకు ప్రజలకు ఆ ప్రయోజనం ఇవ్వలేదు..? అని ప్రశ్నించారు. రష్యా నుంచి భారీ డిస్కౌంట్‌తో ముడి చమురు దిగుమతి చేసుకున్న సమయంలో కూడా ధరలు తగ్గించకుండా, లాభాలను ఆయిల్ కంపెనీలకే కట్టబెట్టారని ఆరోపించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచబోమని చెప్పిన బీజేపీ నాయకులు, ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలను భారీగా పెంచి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. రోజురోజుకీ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న వేళ, ఇంధన ధరల పెంపు కారణంగా రవాణా ఖర్చులు పెరిగి అన్ని వస్తువుల ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా పెట్రోల్‌పై విధిస్తున్న వ్యాట్‌ను తగ్గించి ప్రజలకు ఊరటనివ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## అడ్డగోలుగా ఫ్లెక్సీలు.. ప్రజల ప్రాణాలకు ముప్పు..!

- రోడ్డు మలుపులు, చౌరస్తాల్లో ప్రమాదకర హోర్డింగ్స్
- వెంటనే తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీసీకి ప్రజల విజ్ఞప్తి

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

కుంట్లూర్ డివిజన్ పరిధిలో రోడ్లకు ఇరువైపులా, ముఖ్యంగా మూల మలుపులు, చౌరస్తాల వద్ద అడ్డగోలుగా ఏర్పాటు చేస్తున్న భారీ ఫ్లెక్సీలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయని స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాసంస్థలు, రాజకీయ నాయకులు ప్రచారం పేరుతో నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నా, సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాగోల్ రోడ్డులో నూతనంగా ప్రారంభమవుతున్న శాంక్చస్ వరల్డ్ స్కూల్ - హయత్‌నగర్ బ్రాంచ్ అడ్మిషన్ల ప్రచారం కోసం రహదారులకు అడ్డంగా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కుంట్లూర్ చౌరస్తా మూల మలుపు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఇన్ని ఫ్లెక్సీలు ఎలా ఏర్పాటు చేస్తున్నారు..? సాధారణ ప్రజలపై వెంటనే జరిమానాలు విధించే అధికారులు, ప్రభావశీలుల విషయంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..? అంటూ స్థానికులు మండిపడుతున్నారు. అక్రమ ఫ్లెక్సీల వల్ల ఎప్పుడైనా ఘోర ప్రమాదం జరిగే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. రోడ్డు భద్రతను పూర్తిగా పక్కనపెట్టి రాజకీయ అండదండలతో విద్యాసంస్థలు, కొంతమంది నాయకులు ప్రచార హడావుడి చేస్తున్నారని, ప్రజల ప్రాణాల కంటే ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తక్షణమే స్పందించి, రహదారులకు అడ్డంగా, మూల మలుపుల వద్ద ప్రమాదకరంగా ఏర్పాటు చేసిన అన్ని అక్రమ ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే సంబంధిత విద్యాసంస్థలు, రాజకీయ నాయకులపై భారీ జరిమానాలు విధించి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన అక్రమ ఫ్లెక్సీలపై ఇప్పటికైనా జీహెచ్ఎంసీ యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని, లేకపోతే భవిష్యత్తులో జరిగే ప్రమాదాలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.




## డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక తనిఖీలు

- అజీజ్‌నగర్ పరిధిలో పోలీసులు అవగాహన కార్యక్రమం
- ఎస్‌హెచ్‌ఓ వై. మల్లికార్జున రెడ్డి, ఎస్ఐ వెంకన్న




**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో నేర నియంత్రణ, మాదక ద్రవ్యాల నివారణ మరియు డ్రగ్స్ వ్యతిరేక చర్యల్లో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఎస్‌హెచ్‌ఓ వై. మల్లికార్జున రెడ్డి, ఎస్ఐ వెంకన్న ఆధ్వర్యంలో ఫ్యూచర్ సిటీ డాగ్ స్క్వాడ్ బృందం, ఈగల్ టీమ్ సిబ్బందితో కలిసి పాన్ షాపులు, కిరాణా దుకాణాలు మరియు అనుమానాస్పద ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణ యజమానులకు గంజాయి, మాదక ద్రవ్యాలు మరియు ఇతర నిషేధిత పదార్థాల విక్రయాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అవగాహన కల్పించారు.డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు.

## డంపింగ్ యార్డ్ సమస్యపై ఎమ్మెల్యేకు వినతి పత్రం

**చిన్న రావిరాల పరిధిలోని 268 సర్వే నంబర్ సమస్య పరిష్కరించాలని ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం చిన్న రావిరాల పరిధిలోని 268 సర్వే నంబర్‌లో ప్రతిపాదిత ఏకో టౌన్ (డంపింగ్ యార్డ్) సమస్యపై భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిని స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, డంపింగ్ యార్డ్ కారణంగా భవిష్యత్తులో పర్యావరణ కాలుష్యం, ప్రజారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని వివరించారు. గ్రామాల ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నరవిరాల సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్, బండ రావిరాల సర్పంచ్ కందికంటి విజయకుమార్, పిల్లాయిపల్లి సర్పంచ్ పెరుమాండ్ల మహాలక్ష్మి, దానయ్య దేశ్ముఖి సర్పంచ్ దుర్గం జంగయ్య యాదవ్, జూలూరు సర్పంచ్ కాసుల అంజయ్య గౌడ్‌తో పాటు ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఇంచార్జ్ పాలడుగు నాగార్జున్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** మిర్యాలగూడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి నల్గొండ జిల్లా ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి పాలడుగు నాగార్జున్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. యువత కాంగ్రెస్ పార్టీకి బలమైన శక్తిగా నిలవాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో యువత ప్రజా సమస్యలపై ముందుండి పోరాడాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలి
- నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- వ్యవసాయ శాఖ గ్రామ సభలు నిర్వహించాలని డిమాండ్





**సత్తుపల్లి, విశాలభారతి :**

రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతు సంఘం నాయకులు విమర్శించారు. రైతు సంఘం సత్తుపల్లి మండల అధ్యక్షులు మొరంపూడి వెంకట్రావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను కోరారు.ఈ సందర్భంగా రైతు సంఘం డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రైతుబంధు నిధులను తక్షణమే రైతులకు విడుదల చేయాలని కోరారు. రైతులు ఏ రకం పంటలు సాగు చేస్తే బోనస్ లభిస్తుందో ప్రభుత్వం ముందుగానే ప్రకటించాలని, గ్రామ స్థాయి వరకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.ప్రస్తుత వర్షాల పరిస్థితి, నీటి లభ్యత, మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఏ పంటలు సాగు చేయాలి, ఎలాంటి విత్తనాలు వినియోగించాలి అనే అంశాలపై వ్యవసాయ శాఖ వెంటనే మార్గదర్శకాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని కోరారు.అదేవిధంగా నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన విత్తనాలు మరియు ఎరువులు రైతులకు సమయానికి అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ప్రభుత్వం, వ్యవసాయ శాఖ పూర్తి స్థాయిలో అప్రమత్తమై రైతులకు అవసరమైన సహకారం అందించాలని నాయకులు కోరారు..ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు కంచర్ల వెంకటేశ్వరావు, చావ రమేష్, చల్లపల్లి వెంకటేశ్వరరావు, సర్వేశ్వరరావు, నాగేశ్వరరావు, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు జనుము విత్తనాల పంపిణీ

**వ్యవసాయ అధికారి అనురాధ**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మండల రైతులకు వ్యవసాయ శాఖ ముఖ్య ప్రకటన విడుదల చేసింది. మండలంలో రైతుల కోసం 150 క్వింటాళ్ల జనుము విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు.విత్తనాలు పొందాలనుకునే రైతులు కనీసం ఒక ఎకరం భూమి కలిగి ఉండాలని సూచించారు. రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో ఈ నెల 26వ తేదీన మొయినాబాద్ రైతు వేదిక వద్ద హాజరై విత్తనాలకు సంబంధించిన రసీదు తీసుకోవాలని కోరారు. ముందుగా వచ్చిన రైతులకు ప్రాధాన్యం ఇవ్వబడుతుందని తెలిపారు.జనుము విత్తనాల పూర్తి ధర రూ.15,550 కాగా, ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో రైతులు రూ.7,775 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. 40 కిలోల విత్తనాల ధర రూ.3,110గా నిర్ణయించినట్లు తెలిపారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ సబ్సిడీతో నాణ్యమైన విత్తనాలు పొందాలని వ్యవసాయ శాఖ సూచించింది.

# మంత్రి శ్రీధర్ బాబును కలిసిన చిన్నమంగళారం గ్రామ నాయకులు

**అభివృద్ధి పనులపై సానుకూల స్పందన**



**మొయినాబాద్ , విశాలభారతి:** జిల్లా ఇంచార్జ్ మంత్రి గౌరవనీయులు దుద్దిళ్ల శ్రీధర్ బాబును చేవెళ్ల అసెంబ్లీ కాంగ్రెస్ ఇంచార్జ్ పామేన భీమ్ భరత్ ఆధ్వర్యంలో చిన్నమంగళారం గ్రామ నాయకులు కలిసి గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా చిన్నమంగళారం బ్రిడ్జి నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం, పొద్దటూరుచిన్నమంగళారం రహదారి అభివృద్ధి వంటి కీలక పనుల గురించి మంత్రివర్యులకు వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.మంత్రి సానుకూలంగా స్పందించడంతో చిన్నమంగళారం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆంజనేయులు గౌడ్, వార్డు సభ్యులు బట్టు నిర్మల మహిపాల్, వల్లూరి రమేష్, గన్నెపాగ పాండు, మాజీ సర్పంచులు బాలమణి రాములు, వాసుదేవులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పి. గోపాల్ రెడ్డి, అచ్చుతా రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ బిక్షపతి గౌడ్, విట్టల్, ప్రభాకర్, గోపాల్, రాజు, శివశంకర్, ప్రసాద్, అంజి, చిన్నమంగళారం మరియు గోపులారం గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# గంగారాం చెరువును కబ్జాదారుల నుంచి కాపాడండి

**ప్రజల నీటి కష్టాలు తీర్చండి : బీజేపీ యువనేత సాయిరాం గౌడ్**



**సైబరాబాద్ విశాలభారతి:** ఒకప్పుడు 118 ఎకరాల్లో విశాలంగా విస్తరించి పరిసర ప్రాంతాలకు జీవనాధారంగా నిలిచిన గంగారాం పెద్ద చెరువు ప్రస్తుతం కబ్జాలకు గురై సగానికి కుచించుకుపోయిందని బీజేపీ యువనేత రగిరి సాయిరాం గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో చెరువు దుస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.చెరువులో చుక్కనీరు లేకపోవడంతో చుట్టుపక్కల కాలనీల్లో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పూర్తిగా ఎండిపోయాయని సాయిరాం గౌడ్ తెలిపారు. దీంతో వేలాది కుటుంబాలు తాగునీటి కోసం రోజూ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని, పిల్లల స్నానాల నుంచి వంట వరకు ప్రతి పనికీ నీటి కటకట ఎదురవుతోందని వివరించారు. సుందరీకరణ పనుల పేరుతో ఏం జరుగుతోందో ప్రజలకు అర్థం కావడం లేదని, అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపమే చెరువు కబ్జాకు గురై కుచించుకుపోవడానికి ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. అక్రమ ఆక్రమణలపై సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని సాయిరాం గౌడ్ విమర్శించారు. వెంటనే పారదర్శకంగా సుందరీకరణ పనులు చేపట్టడంతో పాటు కబ్జాకు గురైన చెరువు భూములన్నింటినీ ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకొని చెరువును పునరుద్ధరిస్తేనే భూగర్భ జలాలు పెరిగి ప్రజల తాగునీటి కష్టాలు తీరతాయని అభిప్రాయపడ్డారు. ప్రజల జీవనాధారమైన చెరువును కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అలీ తలాబ్‌లో మురుగు ఆపాలి

**డీసీకి ఏంసీపీఐ యూ వినతి**




డిసి చాముండేశ్వరికి వినతి పత్రం ఇస్తున్న ఎంసిపిఐ యూ నాయకులు

**సైబరాబాద్ విశాలభారతి:** అలీ తలాబ్‌లోకి మురుగు నీరు కలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఎం (ఐక్య) హైదర్‌నగర్ డివిజన్ కన్వీనర్ ఇక్రాన్ షేక్ సోమవారం సర్కిల్ 51 డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో గుర్రపు డెక్క తొలగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రస్తుతం ఎస్‌టీపీ లైన్ ఉన్నా నిర్లక్ష్యం వల్ల డ్రైనేజీ నీరు నేరుగా చెరువులో కలుస్తోందని పేర్కొన్నారు. దీంతో తీవ్ర దుర్వాసన, దోమల బెడద పెరిగి పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని, డెంగ్యూ, మలేరియా ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు నీరు నల్లగా మారి పశువులు, పక్షులు కూడా తాగలేని స్థితికి చేరిందన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా వెంటనే ఎస్‌టీపీ లైన్‌లో మురుగును కలిపి కాలుష్యం ఆపాలని, లేకుంటే ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో శ్రీధర్, రవి,గిరి, శ్యామ్ గౌడ్, ఇమ్రాన్,ముస్తఫా, జహంగీర్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

# హఫీజ్‌పేట్‌లో పెండింగ్ పనులు పూర్తి చేయాలి


**డీసీ శశిరేఖకు బీజేపీ నేత జితేందర్ వినతి**




డిసి శశిరేఖ కు వినతి పత్రం అందజేసిన బిజెపి నాయకుడు జితేందర్


**సైబరాబాద్ విశాలభారతి:** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో సీఎంసీ వివిధ శాఖల పెండింగ్ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కైతాపురం జితేందర్ డిమాండ్ చేశారు. సోమవారం మియాపూర్ సర్కిల్ డీసీ శ్రీమతి శశిరేఖను ప్రజావాణిలో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. హుడా కాలనీలోని మల్లయ్య కుంటను అభివృద్ధి చేయాలని, విద్యావాణి హైస్కూల్ పక్కన ఉన్న స్థలాన్ని పార్కుగా తీర్చిదిద్దాలని, హుడా కాలనీ వాటర్ సంప్ వద్ద సీసీ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని వినతిలో కోరారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి సమస్యలు పరిష్కరించాలని డీసీకి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రమణయ్య, డివిజన్ ఉపాధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నరసింహ యాదవ్, కోశాధికారి పవన్ కుమార్, నాయకులు విజయ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# శంషిగూడలో రోడ్డు ఆక్రమణ ప్రజావాణిలో ఫిర్యాదు




శంషిగూడ లో రోడ్డును ఆక్రమించి కొనసాగిస్తున్న నిర్మాణం

**సైబరాబాద్ విశాలభారతి:** శంషిగూడ గ్రామస్తులు దుర్లపల్లి శ్యాంరావు, గోపాల్ సోమవారం ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరికి ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలో వీవీవీఎస్ చౌదరి రోడ్డును అక్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో పాటు తాగునీటి పైప్‌లైన్‌ను ధ్వంసం చేశారని వారు ఆరోపించారు. రోడ్డు ఆక్రమణ వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని, పైప్‌లైన్ ధ్వంసంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానికంగా పలుమార్లు సంప్రదించినా స్పందన లేకపోవడంతో ప్రజావాణిని ఆశ్రయించినట్లు తెలిపారు. ఫిర్యాదు స్వీకరించిన డీసీ చాముండేశ్వరి తక్షణ విచారణకు ఆదేశించారు. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్ అధికారులతో క్షేత్రస్థాయిలో సంయుక్త తనిఖీ చేసి 48 గంటల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆరోపణలు రుజువైతే నిబంధనల మేరకు చర్యలు తీసుకుని ఆక్రమణలు తొలగిస్తామని, పైప్‌లైన్‌ను వెంటనే మరమ్మతు చేసి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని ఆమె తెలిపారు. ఫిర్యాదుకు ట్రాకింగ్ ఐడీ కేటాయించి పురోగతిని ఫిర్యాదుదారులకు తెలియజేస్తామని పేర్కొన్నారు.



ప్రజావాణి ఫిర్యాదుకు స్పందించి స్థల పరిశీలనకు వచ్చిన డిసి చాముండేశ్వరి

# యూరియాకు ప్రత్యామ్నాయాలు ఉన్నాయ్

**ఉపకులపతి ప్రొ. జానయ్య**



**రాజేంద్రనగర్, విశాలభారతి :**

యూరియా ఎరువు కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ జానయ్య తెలిపారు. గత పది నుండి పదిహేను సంవత్సరాలుగా యూరియా ఇతర ఎరువులతో పోలిస్తే చౌకగా లభించడం వల్ల రైతులు అధికంగా వినియోగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అయితే యూరియా అధిక వాడకం వల్ల దిగుబడిలో పెద్దగా మార్పు లేకపోయినా, ఆరోగ్య మరియు పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. గల్ఫ్ యుద్ధ ప్రభావంతో యూరియా సరఫరాలో కొంత తగ్గుదల వచ్చినా రైతులకు పెద్దగా ఇబ్బంది ఉండదని, ఎందుకంటే యూరియాకు అనేక ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా నానో యూరియా ప్రస్తుతం మార్కెట్లో సమృద్ధిగా లభ్యమవుతోందని, దీని వాడకం ద్వారా మొక్కలకు అవసరమైన నత్రజని అందుతుందని తెలిపారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం ధృవీకరించిన జీవ ఎరువులు కూడా యూరియాకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించవచ్చని సూచించారు. పచ్చిరొట్ట పంటలను వేసి, 40 రోజుల తర్వాత వాటిని నేలలో కలపడం ద్వారా నేలలో సేంద్రియ పదార్థం పెరిగి నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఈ సంవత్సరం ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున, వరి బదులుగా పప్పుధాన్యాలు, నూనె గింజలు మరియు ఇతర మెట్టపంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ పంటలకు యూరియా అవసరం తక్కువగా ఉంటుందని చెప్పారు. ఈ పరిస్థితులను ఒక అవకాశంగా తీసుకుని పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తే రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా ప్రజల ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని ప్రొఫెసర్ జానయ్య పేర్కొన్నారు.

# మందలపల్లిలో వెలుగు కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ




- గ్రామాభివృద్ధికి మరింత ఊతమిస్తుందన్న ప్రజాప్రతినిధులు
- వెలుగు కార్యాలయ నిర్మాణానికి ఘనంగా భూమిపూజ
- మహిళా సంఘాలకు ప్రత్యేక కేంద్రంగా కార్యాలయం
- గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమన్న సీనియర్ నాయకులు పర్వతనేని



**అశ్వారావుపేట, విశాలభారతి :**

మందలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మహిళా సంఘాల కార్యకలాపాలు, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రంగా నిలిచే వెలుగు కార్యాలయ నిర్మాణానికి సోమవారం ఘనంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాభివృద్ధి దిశగా ఇది కీలక అడుగుగా నిలుస్తుందని ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు.గ్రామంలో మహిళా సంఘాల నిర్వహణ, స్వయం ఉపాధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, గ్రామీణ ఆర్థికాభివృద్ధికి సంబంధించిన కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగించేందుకు ప్రత్యేక కార్యాలయం అవసరమని స్థానిక ప్రజలు చాలాకాలంగా కోరీ వేచి చూడగా ఈ నేపథ్యంలో వెలుగు కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలపడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది.భూమిపూజ కార్యక్రమంలో మందలపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, సీసీతో పాటు దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పర్వతనేని వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో మహిళా సంఘాలు బలోపేతం కావడానికి, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు విస్తరించడానికి వెలుగు కార్యాలయం ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామ ప్రజలకు అవసరమైన సేవలు ఒకే చోట అందుబాటులోకి రావడంతో పాటు ప్రభుత్వ పథకాల అమలు కూడా వేగవంతం అవుతుందని పేర్కొన్నారు.అలాగే గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని నాయకులు కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక స్వావలంబనకు వెలుగు సంస్థలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని, కొత్త కార్యాలయం నిర్మాణంతో కార్యకలాపాలు మరింత చురుకుగా సాగుతాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో స్థానిక ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భూమిపూజ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

# పోషకాహారంపై అవగాహన కార్యక్రమం

**సమతుల ఆహారం తీసుకోవాలని సూచించిన సర్పంచ్ మడి రాజేందర్ రెడ్డి**




**మొయినాబాద్, విశాలభారతి:** కాశించేలి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మడి రాజేందర్ రెడ్డి పాల్గొని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సరైన పోషకాహారం తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవనం కోసం సమతుల ఆహారం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి రోజు ఆహారంలో పండ్లు, కూరగాయలు, పప్పులు, చిరుధాన్యాలు వంటి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అధికంగా చక్కెర, ఉప్పు, నూనె పదార్థాలు తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా కుటుంబ ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా నాట్య మండలి రాష్ట్ర మహాసభలకు వాహన ర్యాలీ ప్రారంభం

**జెండా ఊపి ప్రారంభించిన సిపిఐ నేత ముత్యాల యాదిరెడ్డి**




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** నారాయణగూడలో జరుగుతున్న ప్రజా నాట్య మండలి నాలుగవ రాష్ట్ర మహాసభలకు హాజరయ్యే ప్రతినిధులు, కళాకారుల వాహన ర్యాలీని రంగారెడ్డి జిల్లా ప్రజా నాట్య మండలి ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వేణుగోపాల చారి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు.అబ్దుల్లాపూర్‌మెట్ మండలం రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్ -3 భూ పోరాట కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజా నాట్య మండలి సామాజిక చైతన్యానికి, ప్రజా సమస్యలపై కళారూపాల ద్వారా అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర మహాసభలు ప్రజా కళాకారులకు మరింత దిశానిర్దేశం చేసే వేదికగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి నాయకులు రాము, నారాయణ, సరస్వతి, గోపి, రవి, ప్రియ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

# హృదయ విదారక సంఘటన.. అన్నకు తలకొరివి పెట్టిన చెల్లి

**విశాలభారతి , కరకగూడెం :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం తాళ్లగొమ్మూరు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో కరకగూడెం మండలానికి చెందిన మనోహర్ (19) మృతి చెందగా, తల్లిదండ్రులు కోమాలోకి వెళ్లారు. కుటుంబ పరిస్థితుల కారణంగా చెల్లెలు అన్నకు తలకొరివి పెట్టిన హృదయ విదారక ఘటన సోమవారం కరకగూడెంలో చోటుచేసుకుంది. కరకగూడెం గ్రామానికి చెందిన ఆడెపు సతీష్ తన భార్య స్వప్న, కుమారుడు మనోహర్‌తో కలిసి భద్రాచలం ఆసుపత్రికి వెళ్తుండగా ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మనోహర్ ఆసుపత్రిలో మృతి చెందాడు. సతీష్, ఆయన భార్య స్వప్న తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుటుంబంలో పెద్దలు అందుబాటులో లేకపోవడంతో మనోహర్ చెల్లెలు మాధురి, అన్న అంత్యక్రియల్లో తలకొరివి పెట్టి దహన సంస్కారాలు నిర్వహించింది. చిన్న వయసులోనే చెల్లెలు ఇలాంటి బాధ్యతను భుజాన వేసుకోవాల్సి రావడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. ఈ హృదయ విదారక ఘటన చూసిన గ్రామస్తులు భావోద్వేగానికి గురయ్యారు.



# అంగన్వాడీ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

- చిన్నారుల ఆరోగ్యం – ప్రభుత్వ తొలి ప్రాధాన్యత
- అంగన్వాడీ వ్యవస్థ బలోపేతానికి చర్యలు
- అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్



**కురవి విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా బంగారుగూడెం గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, మహిళలు, అంగన్వాడీ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించి, కేంద్రంలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. భుక్య మారోని గోపా నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజలపై ఎటువంటి అదనపు భారాలు వేయకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్య, వైద్యం, మహిళా సంక్షేమం, గ్రామీణాభివృద్ధి రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్నామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. పిల్లలకు అందిస్తున్న పోషకాహారంలో నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమన్నారు. మరింత మెరుగైన పోషకాహారం అందించి పిల్లల శారీరక, మానసిక వికాసానికి తోడ్పడే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. అదేవిధంగా గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్, డ్రైనేజీ, విద్యా సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. అంగన్వాడీ సిబ్బంది చిన్నారుల భవిష్యత్తు నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వారి సేవలను ప్రభుత్వం గుర్తిస్తోందని పేర్కొన్నారు. అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది సంక్షేమం కోసం ప్రభుత్వం సానుకూలంగా ఆలోచిస్తోందని, త్వరలో ఉద్యోగులకు మరింత భరోసా కల్పించే నిర్ణయాలు తీసుకునే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపినట్లు కార్యక్రమంలో చర్చ జరిగింది. అలాగే గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థికాభివృద్ధికి స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, వైద్య సేవల విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఎమ్మెల్యే వివరించారు. చిన్నారుల ఆరోగ్యమే రాష్ట్ర భవిష్యత్తుకు బలమని, ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం చిన్నారులతో ముచ్చటించి వారికి అందుతున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యాదవ కార్పొరేషన్ చైర్మన్‌తో సీఎం సమీక్ష

**యాదవుల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేయాలి: సీఎం రేవంత్ రెడ్డి**



**సైబరాబాద్ విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర యాదవ కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నూతన చైర్మన్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. యాదవ సమాజ సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై సీఎం అమూల్యమైన సలహాలు, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ, యాదవ సోదరుల అభ్యున్నతి కోసం తన వంతుగా అంకితభావంతో పనిచేస్తానని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. తనపై నమ్మకం ఉంచి ఇంతటి బృహత్తర బాధ్యతను అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. యాదవ కులవృత్తిదారుల ఆర్థిక స్వావలంబన, విద్య, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మరింత వేగవంతం చేసేందుకు కార్పొరేషన్ ద్వారా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# ఆల్విన్ కాలనీ ప్రజావాణికి 2 ఫిర్యాదులు

**డీసీ చాముండేశ్వరి ఆధ్వర్యంలో పౌరుల అర్జీల స్వీకరణ**



**సైబరాబాద్ విశాలభారతి:** కూకట్‌పల్లి జోన్ పరిధిలోని సర్కిల్ 51 ఆల్విన్ కాలనీ సీఎంసీ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో 'ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరుల నుంచి మొత్తం 2 ఫిర్యాదులు అందాయని డీసీ చాముండేశ్వరి వివరాలు వెల్లడించారు.ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 1, పారిశుధ్యం (శానిటేషన్) విభాగానికి సంబంధించి 1 ఫిర్యాదు అందింది. రెవెన్యూ, యూబీడీ, ఇంజనీరింగ్, యూసీడీ, వెటర్నరీ విభాగాలకు సంబంధించి ఒక్క ఫిర్యాదు కూడా నమోదు కాలేదని ఆమె తెలిపారు.

**విభాగాల వారీగా ఫిర్యాదులు:**

**టౌన్ ప్లానింగ్:** 1 , **శానిటేషన్:** 1 , రెవెన్యూ, యూబీడీ, ఇంజనీరింగ్, యూసీడీ, వెటర్నరీ: 0 **మొత్తం:** 2

స్వీకరించిన ఫిర్యాదులకు ప్రత్యేక ట్రాకింగ్ ఐడీ కేటాయించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని డీసీ చాముండేశ్వరి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి త్వరితగతిన పరిష్కరించడంతో పాటు ఫిర్యాదుదారులకు ట్రాకింగ్ ద్వారా పురోగతి తెలియజేస్తామని ఆమె స్పష్టం చేశారు.

# నాలా లలో పూడికతీతను వెంటనే చేపట్టండి

**మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి :** పార్సిగుట్ట,అంబర్ నగర్, ఎల్ నారాయణ నగర్ బస్తీలలో గత అనేక మాసాలుగా పవర్ బోర్లు, చేతి పంపులు ఉపయోగంలో లేని మూలంగా వాటిని మరమ్మత్తు చేయాలని జలమండలి ఎండి కి వినతిపత్రం సమర్పించారు.వాటి మరమ్మత్తులను పూర్తి చేయాలని ఆదేశించగా ప్రాంతాలవారీగా పర్యటించి వాటిని గుర్తించి సోమవారం అధికారులకు చూపించడం జరిగిందని మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ అన్నారు . అదే విధంగా గత అనేక మాసాలుగా ఎల్ నారాయణ నగర్, అంబర్ నగర్, మమ్మద్ గూడ నాలా ల లో చెత్త చెదారంతో నిండిపోయి దుర్వాసన వ్యాపిస్తూ రాబోయే రోజులలో వర్షాకాలం రానందున ముందు జాగ్రత్త చర్యగా ఇప్పటినుండి నాలా ల పూడికతీతను వెంటనే పూర్తి చేయాలని జిహెచ్ఎంసి అధికారులను కోరడమైనదని స్వరూప గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో రవి ప్రసాద్ గౌడ్, ఓములు,బబ్లు, నాని, బాలయ్య గుప్తా, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మియాపూర్ ప్రజావాణికి 11 ఫిర్యాదులు

**టౌన్ ప్లానింగ్‌పైనే అత్యధికంగా 7 అర్జీలు**




ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న మియాపూర్ డిసి శశిరేఖ

**సైబరాబాద్ విశాలభారతి :** సర్కిల్ 48 మియాపూర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 11 ఫిర్యాదులు అందాయి. ఇందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి అత్యధికంగా 7 ఫిర్యాదులు రాగా, ఇంజనీరింగ్ విభాగానికి 3, ఇరిగేషన్ విభాగానికి 1 ఫిర్యాదు అందినట్లు అధికారులు తెలిపారు.సర్కిల్ స్థాయిలో జరిగిన ప్రజావాణిలో పౌరులు నేరుగా సంబంధిత విభాగాల అధికారులను కలిసి తమ సమస్యలను విన్నవించారు. రెవెన్యూ, హెల్త్ & శానిటేషన్, యూసీడీ, యూబీడీ, ఎలక్ట్రికల్ విభాగాలకు సంబంధించి సోమవారం ఒక్క ఫిర్యాదు కూడా అందలేదు.

**విభాగాల వారీగా ఫిర్యాదుల వివరాలు:**

**టౌన్ ప్లానింగ్:** 7 , **ఇంజనీరింగ్:** 3 , **ఇరిగేషన్:** 1

రెవెన్యూ, హెల్త్ & శానిటేషన్, యూసీడీ, యూబీడీ, ఎలక్ట్రికల్: 0 , **మొత్తం:** 11

స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక ట్రాకింగ్ ఐడీ కేటాయించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. టౌన్ ప్లానింగ్ అనుమతులు, అక్రమ నిర్మాణాలపైనే ఎక్కువ ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి త్వరితగతిన పరిష్కరిస్తామని, ఫిర్యాదుదారులకు ట్రాకింగ్ ద్వారా పురోగతి తెలియజేస్తామని సర్కిల్ అధికారులు పేర్కొన్నారు.

# అంతిమ యాత్రలో పాల్గొన్న సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్



విశాలభారతి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం, కరకగూడెం గ్రామానికి చెందిన అడెపు సతీష్ కుమారుడు అడెపు మనోహర్ సారపాక వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించగా వారి పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి చివరి అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అధైర్య పడకండి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తరుపున ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు, కుటుంబ సభ్యులు, మిత్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగిపోయిన కమ్యూనిటీ హాల్స్, ఆర్ఓ ప్లాంట్లు వెంటనే పూర్తి చేయాలి

- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత
- పూర్తి కాక నిరుపయోగంగా మారిన నిర్మాణాలు
- సురక్షిత మంచినీటి కోసం ఆర్ఓ ప్లాంట్లు ప్రారంభించాలని డిమాండ్



**సత్తుపల్లి, విశాలభారతి:** సత్తుపల్లి మండల వ్యాప్తంగా 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం డీఎంఎఫ్‌టీ నిధులతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించినప్పటికీ అవి మధ్యలోనే నిలిచిపోయి ప్రజలకు ఉపయోగం లేకుండా పోయాయని సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని లైబ్రరీలు, రీడింగ్ రూమ్స్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ కాలనీలలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలను ఒక్కొక్కటి రూ.25 లక్షల వ్యయంతో ప్రారంభించినప్పటికీ గుత్తేదారులు పనులను మధ్యలోనే నిలిపివేశారని ఆరోపించారు. దీంతో కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు చేసినా ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందన్నారు. గత మూడు సంవత్సరాలుగా ఈ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా స్పందించి ఆ నిర్మాణాలను పూర్తి చేసి ఉంటే పేద ప్రజలకు చిన్న చిన్న కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి, విద్యార్థులకు రీడింగ్ రూమ్స్, లైబ్రరీ సౌకర్యాలు అందుబాటులో ఉండేవని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ భవనాలు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోయి దయనీయ స్థితిలో ఉన్నాయని తెలిపారు.అదేవిధంగా మండలంలోని సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజలకు సురక్షిత మంచినీరు అందించేందుకు సింగరేణి సంస్థ నిధులతో నిర్మించిన ఆర్ఓ ప్లాంట్లు కూడా నిరుపయోగంగా మారిపోయాయని విమర్శించారు. కాకర్లపల్లి, కిష్టారం, రుద్రాక్షపల్లి, గౌరిగూడెం, రేజర్ల, సత్తుపల్లి పట్టణంలో మూడు చోట్ల నిర్మించిన ఆర్ఓ ప్లాంట్ల కోసం ఒక్కో ప్లాంట్‌కు సుమారు రూ.9 లక్షల వరకు ఖర్చు చేసినప్పటికీ చాలా చోట్ల పది రోజులకే అవి పనిచేయడం నిలిచిపోయిందని ప్రజలు వాపోతున్నారని తెలిపారు.ఈ విషయంపై పలుమార్లు సింగరేణి సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోయిందన్నారు. వెంటనే సంబంధిత శాఖలు స్పందించి ఆర్ఓ ప్లాంట్లను పునరుద్ధరించి ప్రజలకు సురక్షిత మంచినీరు అందించాలని, అలాగే ఆగిపోయిన కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కావూరి వెంకటేశ్వరరావు, తడికమళ్ళ రామకృష్ణ, బండి వేలాద్రి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవకు ప్రతిష్ఠాత్మక గౌరవం



- రవీంద్రభారతిలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ
- బెస్ట్ ఎన్జీవో ఆఫ్ ది ఇయర్ - 2026 అవార్డు ప్రదానం

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** తెలంగాణలో సమాచార హక్కు చట్టం-2005 అమలు, పౌర హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత కోసం నిరంతరం పోరాడుతున్న సమాచార హక్కు చట్టం సాధన కమిటీ (SHCSC) కి అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రదానం చేసిన ప్రతిష్ఠాత్మక బెస్ట్ ఎన్జీవో ఆఫ్ ది ఇయర్ - 2026 అవార్డును కమిటీ ప్రతినిధులు రవీంద్రభారతి వేదికగా ఘనంగా స్వీకరించారు.హైదరాబాద్‌లోని ప్రముఖ సాంస్కృతిక వేదిక రవీంద్రభారతిలో జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి తో పాటు కమిటీ ముఖ్య నాయకులు, ప్రతినిధులు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జాతీయ, రాష్ట్ర, జిల్లా, గ్రామ స్థాయి కమిటీ సభ్యులు భారీ సంఖ్యలో తరలివచ్చి వేడుకలను విజయవంతం చేశారు. అవార్డు స్వీకరణ అనంతరం రవీంద్రభారతి ప్రాంగణం సభ్యుల హర్షధ్వానాలు, అభినందనలతో మార్మోగింది. ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ..ఈ అవార్డు సమాజంలో మనం తీసుకొస్తున్న మార్పుకు, ప్రజాసేవ పట్ల మన నిబద్ధతకు దక్కిన గుర్తింపు. ప్రతి సభ్యుని కృషి వల్లే ఈ గౌరవం సాధ్యమైంది. ఈ పురస్కారం భవిష్యత్తులో మరింత బాధ్యతతో ప్రజాసేవ చేయాలనే సంకల్పాన్ని పెంచింది అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ అధికారిక పురస్కారాన్ని అందుకోవడం పట్ల కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తుండగా, పలువురు ప్రముఖులు, సామాజిక విశ్లేషకులు కమిటీ సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కడమంచి అజయ్ కుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు అరవింద్ స్వామి, బాపయ్య, బోగం విష్ణు, ముచ్చర్ల మల్లేష్, మూల జితేందర్ రెడ్డి, గుడ్డేటి ప్రవీణ్, దీపక్ కులకర్ణి, శ్రవణ్, రేపాక కిషన్ తదితరులు పాల్గొన్నారు

# ప్రైవేటు విద్యా మాయాజా(గా)లం

- ఫీజుల తూ విద్యార్థులకు చుక్కలు
- ఉపాధ్యాయుల టీములతో విద్యార్థులకు గాలం
- హంగు ఆర్భాటాలతో విద్యార్థులతో చెలగాటం
- సొసైటీలు ఒకటైతే రసీదులు మరొక దాని పైన
- తవ్వే కొద్ది బయటపడనున్న డొల్లతనం



**భద్రాచలం, విశాలభారతి:**

ఏజెన్సీ ప్రాంతంలో ఎవరికి వారు ఇష్టానుసారంగా ప్రైవేటు విద్యాసంస్థలు ఫీజులను విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తుంది. అధికారులు ఉండి కూడా లేనట్టుగా వ్యవహరించడం పట్ల పలువురికి అనుమానాల కు తావిస్తున్నాయి. హంగు ఆర్భాటాలతో విద్యార్థులకు సినిమా చూపిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల విద్యా దోపిడి

**అధిక ఫీజులతో విద్యార్థుల వద్ద దోపిడీ**

ప్రైవేటు విద్యాసంస్థలు కార్పొరేట్ విద్యాసంస్థలు ఏజెన్సీ ప్రాంతంలో అధికంగా ఫీజులను వసూలు చేయటం సునాయాసంగా విద్యార్థుల వద్ద డబ్బులను గుంచటం వెన్నతో పెట్టిన విద్యగా మారింది. ప్రైవేటు విద్య అయితే నాణ్యంగా ఉంటుందని తల్లిదండ్రుల అపోహ వలన ఇదే అదునుగా భావించిన ప్రైవేటు విద్యాసంస్థలు హంగు ఆర్భాటాలతో తల్లిదండ్రులను విద్యార్థులను ఆకట్టుకుంటూ ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా విద్యార్థి హక్కు చట్టం తుంగలో తొక్కి నచ్చినట్లు ఫీజులు వసూలు చేస్తున్నారు.

**స్కూళ్లలోనే మెటీరియల్ అమ్మకాలు**

విద్యాహక్కు చట్టం ప్రకారం స్కూళ్లలో ఎటువంటి మెటీరియల్స్ అమ్మకూడదని నిబంధన ఉంది కానీ ఏ ఒక్క స్కూలు దానిని పాటించకుండా ఎవరికి నచ్చినట్లు వాళ్లు స్కూలు మెటీరియల్స్ ను ఎవరికి నచ్చిన రేట్లతో వాళ్లు అమ్ముకుంటున్నారు విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద అధిక మొత్తంలో ముక్కు పిండి మరి డబ్బులు వసూలు చేస్తూ విద్యా వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా చేసుకుంటున్నారు.

**విద్యార్థులకు అధిక భారం**

ప్రవేట్ విద్యాసంస్థల్లో విద్యా వ్యాపారం నిబంధనలకు విరుద్ధంగా యదేచ్ఛగా కొనసాగుతోంది వసూలు చేసిన వాళ్లకి వసూలు చేసినంత అన్నట్లుగా విద్యా సంస్థల వ్యవహార పరిస్థితి కనిపిస్తుంది. విద్యార్థులపై అధిక పుస్తకాలు వీపులపైన మోపిస్తూ వారి లేత వెన్నులపైన అధిక బరువుని మోపిస్తూ చిన్న వయసులోనే అనారోగ్యం పాలు చేసే దుస్థితి నేడు కనిపిస్తుంది. అధికారులు అంతా చూస్తూ కూడా నమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.

**సౌకర్యాలు మాత్రం సున్నా**

ఏ ఒక్క ప్రైవేట్ పాఠశాలలు సరైనటువంటి సౌకర్యాలు కనిపించవు ముఖ్యంగా విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థులు శారీరక దృఢత్వం ఉంటానికి ఆటస్థలం ఉంటేనే విద్యాసంస్థకు పర్మిషన్ ఉంటుంది కానీ ఏ ఒక్క విద్యాసంస్థకు కూడా ఆట స్థలాలు లేకపోవడం విద్యార్థుల ఆరోగ్యం రోజురోజుకీ క్షీణించే పరిస్థితి కనిపిస్తుంది. సరైనటువంటి బాత్రూములు కనిపించవు అత్యవసర సంబంధించి ఫైర్ ఎక్విప్మెంట్స్ ఉండవు. బహుళ అంతస్తులపైన ఇరుకైన గదులలో విద్యను చెప్పటం వలన విద్యార్థుల మానసిక పరిస్థితి దెబ్బతింటుంది. వెలుతురు లేని చీకటి గదులు ఏ ప్రైవేటు విద్యాసంస్థల్లో చూసిన తారసపడుతున్నాయి. ప్రవేట్ విద్యా సంస్థలు అనేక సమస్యలకు నిలయాలుగా మారాయి. అధికారులు మాత్రం అన్ని సక్రమంగా ఉన్నాయని సర్టిఫికెట్ ఇచ్చి విద్యాసంస్థలను ప్రోత్సహిస్తున్నారు.

**చీకటి ఇరుకు గదులలో నిర్బంధపు విద్య**

విద్యార్థులకు విద్యను అర్థమయ్యేలా అవగాహన కలిగేలా సరళంగా చెప్పగలగాలి విద్యార్థులు ఒక్కసారి విన్న తరువాత ఆ సబ్జెక్టుని అవపోసన చేసుకొని పూర్తిస్థాయిలో పరిపూర్ణంగా విద్యార్థి మెదడులో ఆ సబ్జెక్టు తాలూకా పాఠాలను నెమరు వేసుకుంటూ అనేక విషయాల పట్ల పట్టు సాధించాలి. కానీ నేడు పాఠాలు అలా బోధించని నేపథ్యం ఉంది. పొద్దుట నుండి సాయంత్రం వరకు విద్యార్థులకు సబ్జెక్టు మీద పూర్తి అవగాహన కల్పించకుండా అర్థవంతంగా చెప్పకుండా పుస్తకాన్ని చేతికిచ్చి బట్టి పట్టిస్తున్నారు. దీనివల్ల విద్యార్థుల మేధో శక్తి రోజుకి క్షీణించిపోతుంది. బట్టి చదువులు వలన విద్యార్థులకు భూతద్దాలు వస్తున్నాయి. సబ్జెక్టు పైన పూర్తి స్థాయిలో విశ్లేషణ చేయకపోవడం బట్టి చదువుల మీద ఆధారపడటం వలన అనేక అనర్థాలు జరుగుతున్నాయి అనేది నేడు కనిపిస్తుంది. అధికారులు విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై మూలాలను పరిశీలించే అధికారి కనిపించట్లేదు.

**విద్య అధికారుల పర్యవేక్షణ లోపం**

కార్పొరేట్ విద్యాసంస్థలు ఏజెన్సీ ప్రాంతంలో విచ్చలవిడిగా విద్యా వ్యాపారాన్ని కొనసాగిస్తూ విద్యార్థుల వద్ద అధిక మొత్తంలో ఫీజులను వసూలు చేస్తూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ఏజెన్సీ ప్రాంతంలో విద్యార్థులకు శాపంగా మారింది. విద్య హక్కు చట్టాలు ఏమాత్రం కూడా పాటించకుండా నిబంధనలకు నీళ్లు వదిలి కనీస మౌలిక వసతులు కల్పించకుండా అధిక ఫీజులకు పాల్పడుతున్నారు. ఈ సంవత్సరమైనా ఉన్నత అధికారుల పర్యవేక్షణలో కార్పొరేట్ విద్యా సంస్థలను కట్టడి చేయాలి విద్యార్థుల వద్ద అధిక మొత్తంలో ఏజెన్సీ ప్రాంతంలో వసూలు చేస్తున్న విద్యాసంస్థలకు లైసెన్సు రద్దు చేయాలి. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజులు పెను భారంగా మారుతున్న పరిస్థితిని కట్టడి చేయాలి. అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యాబోధన నిషేధించాలి బట్టి చదువులు విద్యార్థులకు శాపంగా మారకుండా సరి చేయాలి విద్యార్థులు నడిపే సొసైటీలు ఏ పేరు మీద ఫీజులు కట్టించుకుంటున్నారు వాటిపైన సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి. ఏజెన్సీలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను సౌకర్యమైన విద్యను అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా ఉన్నత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.



### స్టార్ హీరోల బ్లాక్‌బస్టర్ల వెనుక

# త్రిష మ్యాజిక్

సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న త్రిష మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. వరుసగా కోలీవుడ్ స్టార్ హీరోల కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఆమె భాగం కావడం ఇప్పుడు అభిమానుల మధ్య ఆసక్తికర చర్చకు దారితీసింది. దీంతో "త్రిష లక్కీ ఛార్మ్" అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఇటీవల ఓ అభిమాని సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ విపరీతంగా వైరల్ అయింది. ప్రముఖ హీరోలు అజిత్, విజయ్, సూర్య కెరీర్‌లలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించడాన్ని ప్రస్తావిస్తూ.. "వారి బ్లాక్‌బస్టర్ విజయాల వెనుక త్రిష మ్యాజిక్ ఉంది" అంటూ రాసుకొచ్చాడు. ఈ పోస్టును త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీతో స్పందించింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ప్రస్తుత తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో త్రిష నటించిన 'లియో' సినిమా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రం 2023లో విడుదలై ప్రపంచవ్యాప్తంగా రూ.600 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు తెలిపాయి. విజయ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఇది నిలిచింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కూడా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ రూపొందించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో త్రిష కీలక పాత్రలో నటించింది. ఈ సినిమా రూ.248 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి అజిత్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచినట్లు ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న సూర్య.. 'కరుప్పు' (తెలుగులో 'వీరభద్రుడు') సినిమాతో మళ్లీ విజయాన్ని అందుకున్నాడు. ఈ చిత్రంలో త్రిష లాయర్ ప్రీతి పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఈ మూడు సినిమాల్లో కూడా త్రిష హీరోయిన్‌గా కనిపించడంతో.. అభిమానులు ఆమెను "లక్కీ ఛార్మ్" అంటూ ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం త్రిష తెలుగులో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంలో నటిస్తోంది. దర్శకుడు వశిష్ట మల్లిడి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ఆమె అవని పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాపై కూడా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.